క్లుప్తంగా

సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి సీఎం కప్ విజేత జట్టును పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి సన్మానించారు. హైదరాబాదులోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో మెదక్ జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో శివ్వంపేట మండలానికి చెందిన క్రీడాకారులు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడంపై వారిని అభినందించి రూ.5 వేల నగదు అందజేశారు.

దీక్షకు ఓయూ విద్యార్థుల మద్దతు

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు గురువారం వారు దీక్షా శిబిరాన్ని సందర్శించి డివిజన్ ఉద్యమంలో పాలు పంచుకుంటామని హామీ ఇచ్చారు. దీక్షలు చేపట్టి గురువారం నాటికి 67 రోజులు గడుస్తుండగా, ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ శ్రీశైలం, లాయర్స్ ఫోరం ప్రతినిధి అనిల్ ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి, రెవెన్యూ మంజూరు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళనలో అఖిలపక్షం నేతలు అశ్విని, రమేశ్‌రెడ్డి, దొమకొండ యాదగిరి, శ్రీనివాస్, సుంకోజ దామోదర్, వినయ్‌సాగర్, చింతల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి, సర్పంచ్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ఊరి చెరువును మండల ప్రత్యేక అధికారి జయరాజ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో చెరువుల వద్ద నిర్వహించే వేడుకలకు చేగుంట చెరువును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, నాయకులు, అధికారులు దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఏఈ మమతతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథ నీరు రాక ఇబ్బందులు

నర్సాపూర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో వారం రోజులుగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీరు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 3వ వార్డు కౌన్సిలర్ ఇస్రాత్ సిద్దిక తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... వారం రోజులుగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో పలుమార్లు సంబంధిత భగీరథ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, నీళ్ల సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హైనా సంచారంతో జనం బెంబేలు



హైనా పాద ముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోనిశంశిరెడ్డిపల్లి తండాలో పక్షం రోజుల క్రితం పాడిగేదెపై హైనా దాడి చేసి చంపిన ఘటన మరువకముందే మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులో సంచరించినట్లు ఆనవాలు లభించడం కలకలం రేపుతుంది. కాళీమాత ఆశ్రమం సమీపంలోని సంగారెడ్డి చెరువు వద్ద రెండు రోజుల క్రితం పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు మొదటగా చిరుత పాదముద్రలుగా భావించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్ గురువారం చెరువు సమీపంలోని పాదముద్రలను పరిశీలించి, హైనా పాదముద్రలుగా నిర్ధారించారు. పంటపొలాల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బడిబాటను విజయవంతం చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిబాట షెడ్యూల్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాటించాలని, బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న కేజీబీవీ కళాశాల పనులు
- అవస్థలు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు



నిర్మాణంలో అల్లాదుర్గం కేజీబీవీ కళాశాల

అల్లాదుర్గం(మెదక్): కేజీబీవీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరై నాలుగేళ్లు గడుస్తున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు ముందుకు సాగడం లేదు. ఒకే భవనంలో పాఠశాల, కళాశాల నిర్వహిస్తుండటంతో విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకే గదిలో 50 నుంచి 60 మంది విద్యార్థినులు నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిపోక పడరాని పాట్లు పడుతున్నారు. ఇది అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల భవనం దుస్థితి.

- అల్లాదుర్గంలో 2018లో బాలికల కళాశాలను ప్రభుత్వం ప్రారంభించింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోనే కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో పాఠశాల, కళాశాల తరగతులు, హాస్టల్ నిర్వహించడంతో విద్యార్థినులు పడరాని పాట్లు పడుతున్నారు.
- కళాశాలలో సీఈసీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభించారు. ఫస్ట్ ఇయర్, సెకండియర్ కలిపి 160 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 తరగతులకు కలిపి 200 మంది బాలికలు చదువుతున్నారు.
- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఒకేషనల్ కోర్సు విద్యార్థినులకు ల్యాబ్ సౌకర్యం లేక సరైన విద్య అందడం లేదు.
- కళాశాల, పాఠశాల విద్యార్థినులకు సరిపడ వసతులు లేవు. తరగతి గదుల్లోనే చదువుకుంటూ.. ఒక్కో గదిలో 50 నుంచి 60 మంది వరకు, అలాగే మరి కొందరు డైనింగ్‌హాల్‌లో నిద్రిస్తున్నారు.
- 360 మంది బాలికలు చదువుకున్న ఒకే భవనంలో సరిపడ మరుగుదొడ్లు, బాత్‌రూంలు, భోజనం చేయడానికి హాల్ లేక పోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.
- అల్లాదుర్గం కేజీబీవీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రెండు కోట్ల 5 లక్షల రూపాయలు మంజూరు చేసింది.
- కాలేజీ భవన నిర్మాణం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలున్నాయి. నాలుగేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

  కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో పనులు సక్రమంగా చేపట్టకున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.
- జూన్ 1 నుంచి కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి. భవనం నిర్మాణం పనులు మాత్రం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. తలుపులు, కిటికీలు, కరెంట్, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది.
- ప్రస్తుతం భవన నిర్మాణం పనులను ఇద్దరు కూలీలు మాత్రమే చేస్తున్నారు. ఇలా చేసుకుంటూ పోతే ఎన్నేళ్లు పడుతుందోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థినులు, అధ్యాపకులకు ఇబ్బందులు తప్పడం లేదు. తొందరగా పనులు పూర్తి చేయించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

అన్ని సమస్యలే..



కళాశాలకు సొంత భవనం లేక, మరుగుదొడ్లు, బాత్‌రూంల వద్ద ఎన్నో అవస్థలు పడుతున్నాం. అనేక సమస్యలతోనే చదువుకుంటున్నాం. కళాశాల భవన నిర్మాణంపై ఎవరు పట్టించుకోవడం లేదు.

– ప్రియాంక, విద్యార్థిని

ఒకే గదిలో 60 మంది..



కేజీబీవీ కళాశాల, పాఠశాల ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. సరిపడ గదు లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఒక గదిలో 60 మంది విద్యార్థులు నిద్రపోతు న్నారు. డైనింగ్ హాల్‌లో సహితం నిద్రించాల్సిన దుస్థితి. తర గతి గదుల్లో సహితం అవస్థలు తప్పడం లేదు.

– వసంత, విద్యార్థిని

‘రైతు దినోత్సవం’ విజయవంతం చేయాలి



మెదక్ మున్సిపాలిటీ: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న నిర్వహించే రైతు వేదిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తెలిపారు. గురువారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... రైతుల సమీకరణ, రైతుబంధు లబ్ధిదారుల సమీకరణ, తగు ఏర్పాట్లు చేయాలని మెప్మా రిసోర్స్ పర్సన్లకు, బిల్ కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో మెదక్ ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్, తహసీల్దార్, కౌన్సిల్ సభ్యులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



టేక్మాల్(మెదక్): మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప కోరారు. గురువారం మండల కేంద్రం టేక్మాల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... ఎటువంటి విభేదాలు లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని కోరారు. మండలంలోని అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన రాజాగౌడ్‌ను మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ నేతృత్వంలో పార్టీని బలోపేతం చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఇందులో ఎంపీపీ చింత స్వప్నరవి, నాయకులు బసంతరావు, భాస్కర్, మాణెయ్య, సిద్ధయ్య, యశ్వంత్‌రెడ్డి, అవినాష్, సిద్దన్న, సాయిలు, చంద్ర శేఖర్, సర్దార్, శివకుమార్, మల్లేశం, సాయిరెడ్డి, మహేందర్, మాణిక్యం, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతీ విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలి’



మాట్లాడుతున్న సర్పంచ్ సత్యనారాయణ

టేక్మాల్(మెదక్): బడిబాటను ఘనంగా నిర్వహించాలని సర్పంచ్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు, బడిబాట కార్యక్రమాలపై చర్చించారు. ప్రతీ విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా చూడాలని కోరారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, దశాబ్ది ఉత్సవాల్లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో జస్టిస్ చంద్రయ్య



జస్టిస్ చంద్రయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ భిక్షపతి

మనోహరాబాద్(తూప్రాన్): జస్టిస్ చంద్రయ్య మనోహరాబాద్ మండల కేంద్రానికి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భిక్షపతి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వీరి వెంట డీటీ శ్రీకాంత్, ఆర్‌ఐ దీక్షిత్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు రూ.25 వేలు



జాతరలో మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): తల్లిదండ్రులు లేని పిల్లలకు రూ.25 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందజేస్తామని మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధినేత రోహిత్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని పాత లింగాయపల్లిలో జరుగుతున్న బీరప్ప జాతరలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి అవసరమైన బోర్లు వేయిస్తామని, మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ప్రశాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బ్యాగుల పంపిణీ**



బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): మండలంలోని దోసపల్లి గ్రామంలో సంగారెడ్డిలోని హోప్‌న్యూరో ఆస్పత్రి, సుస్థిర అభివృద్ధి సంస్థ సంయుక్తంగా పర్యావరణహిత జీవనశైలిపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ విజయలక్ష్మీ చేతులమీదుగా బ్యాగులను పంపిణీ చేశారు.

◆ **వెల్మకన్నలో వైద్యశిబిరం**



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో హైదరాబాద్ సూరారం వద్దగల మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుశాంత్‌రెడ్డి, డాక్టర్ సాయిస్వరూప్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు వైద్యపరీక్షలు నిర్వహించి, చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 105 మందికి చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాజీపేట రాజేందర్, ఆస్పత్రి పీఆర్‌ఓ హరికృష్ణ, నాగప్ప, వైద్యసిబ్బంది శరోని, సంరిన్, బసంతి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**



రామాయంపేట(మెదక్): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు నాగరాజును గురువారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు బాబు, నార్సింగి ఉప సర్పంచ్ యోగి, మండల శాఖ మాజీ అధ్యక్షుడు తౌర్యానాయక్, మాజీ ఎంపీటీసీ సత్యం, నర్సంపల్లి గ్రామశాఖ పార్టీ అధ్యక్షుడు లాలం, నాయకులు ఫకీర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

◆ **కో ఆప్షన్‌కు సభ్యుడికి మాతృ వియోగం**

రేగోడ్(మెదక్): మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ యువ నాయకుడు చోటు మియా తల్లి సాదత్‌బీ (82) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు దిగంబర్ రావు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, మాజీ సర్పంచ్ గంజి సంగమేశ్వర్, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.సర్దార్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మొహిజొద్దీన్ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

‘దళిత బంధు’తో ఆర్థిక స్వావలంబన

కలెక్టర్ రాజర్షిషా



సిమెంట్ దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పాపన్నపేట(మెదక్): దళిత బంధు పథకంతో లబ్ధిదారులు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం ఆయన అబ్లాపూర్‌లో దళిత బంధు లబ్దిదారు కిష్టయ్య నడుపుతున్న సిమెంట్ దుకాణాన్ని సందర్శించారు. అందుకు సంబంధించిన రికార్డులు, జీఎస్టీ, లాభాలు, నష్టాలు, స్టాక్ రిజిష్టర్ పరిశీలించారు. అలాగే మార్కెటింగ్ విధానం, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వ్యాపారం లాభాల బాటలో నడుపుతున్నందుకు కిష్టయ్యను సన్మానించారు. ఆయన వెంట నాయకులు రాజు, పంచాయతీ కార్యదర్శి కుమార్ ఉన్నారు.

ప్రజా శ్రేయస్సుకు మరింత కృషి



వేడుకల్లో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజా శ్రేయస్సు కోసం ఎంపీపీ కల్లూరి హరికృష్ణ మరింతగా కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ జన్మదిన వేడుకలు శివ్వంపేట, ఎదుల్లాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టి, ప్రజాప్రతినిధులు, అభిమానుల మధ్య కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హన్మంత్‌రావు, పూడూర్ అయ్యప్పస్వామి, ధర్మకర్త మల్లారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, బండారి గంగాధర్, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్, రాజశేఖర్‌గౌడ్, మన్సే నర్సింలు, రవీందర్‌గౌడ్, అరుణ్, గణేశ్‌గౌడ్, శివ, నగేశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు బాధ పడుతుంటే మీకు ఉత్సవాలా..?

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ



మాట్లాడుతున్న రమణ

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ ప్రజలకు ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... రైతులు బాధపడుతుంటే సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేసిందని, రైతు రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారని విమర్శించారు. కనీసం రైతులు తీసుకొచ్చిన ధాన్యం కూడా కొనలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంజాగౌడ్, స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ ఉన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని దామరంచ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రాగౌడ్, కౌడిపల్లి ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోపి, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డికి మంజూరైన రూ. 26 వేల సీఎం సహాయనిధి చెక్కును లబ్ధిదారుడికి వారు అందజేశారు.

‘కార్యకర్తలను ఆదుకుంటాం’



చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

రామాయంపేట(మెదక్): ప్రమాదవశాత్తు మృతి చెందిన నార్సింగి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఈరప్ప కృష్ణ కుటుంబానికి గురువారం పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరకు శ్రీనివాసరెడ్డి రూ. 2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసగౌడ్, రమణ, డీసీసీ నాయకుడు యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, సంకాపూర్ ఉప సర్పంచ్ కేశవులు, శివునూర్ గ్రామశాఖ అధ్యక్షుడు పాషా, నాయకులు నవీన్, రఫీక్, కుమార్, మల్లయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమ్మ ఉత్సవాలు



కోటమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో కోటమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఉత్సవాల్లో జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేస్తే సంతృప్తినిస్తుంది

ములుగు(గజ్వేల్): పేదలకు సాయం చేస్తే సంతృప్తిగా ఉంటుందని ఏటుజెడ్ పౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి మహ్మద్ జుబేర్‌పాష అన్నారు. ములుగు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ హనీఫ్ మనవరాలు వివాహానికి హాజరై రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.